క్రైం కథ

# దోషికి శిక్ష తప్పదు

**'జనతా బజార్ వీధి' జనంతో సందడిగా ఉంది. ఆ వీధి వద్ద ఫైర్ ఇంజన్‌లు ఆగి వున్నాయ్. ఆ వీధి చివరనున్న షాపు వద్ద ఫైర్‌మెన్‌లు మంటల్ని ఆర్పుతున్నారు. 'పురుడు పూర్తి అయినా పురిటి వాసన పోలేదన్నట్టు'గా మంటలు ఆరిపోయినా ఇంకా పొగల ప్రతాపం పోలేదు.**

అంతలో అక్కడికి పోలీసు జీప్ స్పీడ్‌గా వచ్చి ఆగింది. జీపులోంచి బిలబిలమంటూ పోలీసులు దిగారు. షాపు వద్దనున్న జనాన్ని దూరంగా పంపారు. క్రైమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కనకరాజు, సార్జెంట్ సారథి, వేలిముద్రల నిపుణుడు నీలకంఠం, ఫోటోగ్రాఫర్ వేలుపిళ్లైలు జీపులోంచి దిగారు. కనకరాజు సిబ్బందికి తగు సూచనలు చేశాడు. ఒక్కసారి షాపువైపు చూశాడు. ఆ షాపు ఫ్యాన్సీ అండ్ స్టేషనరీ షాపు. బోర్డు కిందనుంచి అతడి దృష్టి కిందకు వెళ్ళింది. గుమ్మానికి ఐరన్ షట్టర్ సగం దిగి ఉంది. ఆ సందులోంచే పొగలు బయటకు వస్తున్నాయి. షట్టర్‌కు బాగా మసిపట్టి ఉంది.

కనకరాజు, వేలిముద్రల నిపుణుడు నీలకంఠాన్ని పిలిచి వెంటనే షట్టర్ మీదనున్న వేలి ముద్రల్ని తనిఖీ చేయమన్నాడు. నీలకంఠం పని ప్రారంభించాడు.

''సార్! ఈ షట్టర్‌పై రెండు జతల వేలిముద్రలున్నాయి'' అన్నాడు నీలకంఠం.

ఫోటోగ్రాఫర్ వేలుపిళ్లైకి సౌజ్ఞ చేశాడు కనకరాజు. వేలుపిళ్లై వెంటనే షట్టర్‌పై వున్న వేలి ముద్రలను తన కెమెరాతో బంధించాడు. పి.సి.ల చేత షట్టర్ ఎత్తించి లోపలకు వెళ్లాడు కనకరాజు. షాపు లోపల వున్న వస్తువులు, ఫర్నిచర్ కాలిపోయాయి. ఆ షాపునకు ఆనుకుని మరో గది లేదు. గదికి నైరుతి మూలన, మాడిపోయి పడివున్నాడో వ్యక్తి. ఆ వ్యక్తి వద్దకు వెళ్లి చూశాడు కనకరాజు. ఆ వ్యక్తి శరీరం అంతా కాలిపోయి లేదు. కొంత శాతం కాలిపోయింది. మొహం వికృతంగా వుంది. ఆ వ్యక్తి ప్రాణం పోయి కనీసం ఆరు గంటలు అయివుంటుందని అంచనా వేసుకున్నాడు. ఒక్కసారి షాపునంతా పరిశీలించాడు. ఎలక్ట్రిక్ వైర్లవేపు చూశాడు. వైర్లు కాలిపోయాయి. ఏ ఆధారం దొరకలేదు. ఆలోచనలో పడ్డాడు. అంతలో అక్కడకు పోలీసు సర్జన్ వరదారావు వచ్చాడు. శవాన్ని పరీక్షించాడు. శవం శరీరంపైన ఏమైనా గాయాలున్నాయా అని చూశాడు. తలఎత్తి కనకరాజువేపు చూశాడు. పెదవ్విరిచాడు.

''ఏం! డాక్టర్.. ఏమైనా తెల్సిందా?'' ఆత్రంగా ప్రశ్నించాడు కనకరాజు.

''కనకరాజు గారు.. మీకు వివరంగా తర్వాత రిపోర్ట్ పంపిస్తాను'' అన్నాడు పోలీస్ సర్జన్ వరదారావు. శవం ముందునుంచి లేస్తూ.

''అలాగే పంపండి'' అన్నాడు కనకరాజు.

పోలీసు సర్జన్ షాపులోంచి బయటకు వెళ్ళిపోయాడు.

కనకరాజు వెంటనే శవాన్ని పోస్టుమార్టంకు పంపాడు. తర్వాత మరోసారి షాపును పరిశీలించాడు. శవం పడివున్న ప్రదేశంలో కొన్ని వస్తువులు సగం కాలి వున్నాయ్. ఆ వస్తువులు ఆటబొమ్మలు, టాయ్ కార్లు. ఆ వస్తువులను నిషితంగా చూశాడు. షోకేస్‌ల వైపు చూశాడు. అందులో అరలు ఖాళీగా ఉన్నాయి. గదికి మరో మూల రేకు డొక్కు ఉంది. అక్కడకు వెళ్ళాడు రేకు డొక్కు మూత తీశాడు. అందులో కొన్ని పుస్తకాలను బయటకు తీశాడు. ఆ పుస్తకాలు స్టాక్ రికార్డు, బిల్ పుస్తకాలు, ఒక తెల్లకవరు వున్నాయి. బిల్ పుస్తకాల్లో ఒక పుస్తకం తెరిచి చూశాడు.

'శ్రీనాథ్ ఫ్యాన్సీ అండ్ స్టేషనరీ'
ప్రొ: శ్రీనాథ్


అని ఉంది. తల పంకించాడు కనకరాజు. అంటే హతుడి పేరు 'శ్రీనాథ్' అన్నమాట. మిగిలిన పుస్తకాలను చూశాడు. అందులో ఏమీ సమాచారం లేదు. తెల్లకవరు వేపు చూశాడు. కవరు విప్పాడు. లోపల ఏమీలేదు. కవరు మీద శ్రీనాథ్ షాపు చిరునామా ఉంది. కవరు దిగువ ఎడమవేపు చిన్న అక్షరాలతో ఫ్రమ్ అడ్రసును చూశాడు.

''ది భారత్ జనరల్ అండ్ ఫైర్ ఇన్సూరెన్స్ లిమిటెడ్
డాబా గార్డెన్స్, విశాఖపట్నం-4''

అని వుంది. ఆ కవరును జేబులో పెట్టుకుని వెనక్కి తిరగబోతూ ఠక్కున ఆగాడు కనకరాజు. ఆ రేకు డొక్కు వెనక ఏదో వస్తువు అతడికి కనిపించింది. వంగుని ఆ వస్తువును జేబు రుమాలుతో బయటకు తీశాడు. ఆ వస్తువు రేకు టిన్ను. మూత తీసి వాసన చూశాడు.

కనకరాజు కళ్లు మెరిశాయి. ఆ టిన్నును తన పక్కనే వున్న సార్జెంట్ సారథికి యిచ్చి ఏదో చెప్పి పంపించాడు.

''ఫోర్ వన్ టూ'' పిల్చాడు కనకరాజు.



''సార్''

కనకరాజు ముందు ప్రత్యక్షమయ్యాడు పి.సి. ఫోర్ వన్ టూ.

''నువ్వు ... ఈ వీధిలో వున్న షాపులకు వెళ్ళి ఈ షాపు వివరాలు కనుక్కుని రా..'' అన్నాడు కనకరాజు.

పి.సి. ఫోర్ వన్ టూ కనకరాజుకి సెల్యూట్ చేసి బయటకు వెళ్ళాడు.

***

పోలీస్ సర్జెన్ డాక్టర్ వరదారావు పంపిన పోస్టుమార్టం రిపోర్టును దీక్షగా చదవసాగాడు. క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు.

హతుడు హత్యకు లోనవలేదు. అగ్ని ప్రమాదం వల్లే మరణించాడు. మరణానికి ముందు అతడు అధికంగా విస్కీ సేవించాడు. కడుపులో (చిన్నపేగులో) మాంసం ముక్కలు, చికెన్ ముక్కలు వున్నాయి. అంటే భోజనంలో ఎక్కువగా మటన్, చికెన్ కర్రీలున్నాయి. ఇతని శరీరంపై కాల్పులు తప్ప మరేవిధమైన గాయాలూ లేవు. 'కేవలం అగ్నిప్రమాదం వల్లే మరణించాడు' అని ధృవీకరిస్తున్నాను.

సం. డా. వి.వరదారావు
ఎం.ఎస్.

రిపోర్టును మడిచి డ్రాయర్ సొరుగులో పెట్టేడు కనకరాజు. అతడికి గంట క్రితం జరిగిన సంఘటన మెదడులో మెదిలింది.

''నా పేరు కనకరాజు. క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ని'' అన్నాడు కనకరాజు.

''గ్లాడ్ టూ మీట్ యూ సార్! నా పేరు సదాశివం. ది భారత్ జనరల్ అండ్ ఫైర్ ఇన్స్యూరెన్స్ లిమిటెడ్‌కి బ్రాంచ్ మేనేజర్‌ని'' కనకరాజుకి కరచాలనం చేస్తూ అన్నాడు సదాశివం.

''కూర్చోండి'' అన్నాడు సదాశివం.

కనకరాజు కుర్చీలో కూర్చుని జేబులోంచి కవరు తీసి సదాశివానికి అందించాడు.

''ఈ కవరు మీరు పంపిందేనా?'' ప్రశ్నించాడు కనకరాజు.

''ఎస్! మేమే పంపాము. ఈ కవరు మీకెలా వచ్చింది సార్!'' కనకరాజుని ప్రశ్నించాడు సదాశివం.

సదాశివానికి జరిగిన కథ చెప్పాడు కనకరాజు.

''సార్! శ్రీనాథ్ మీ కంపెనీకి ఎంతకాలం నుంచి ప్రీమియమ్‌లు కడుతున్నాడు? అతడి షాపుకి ఎంత ఇన్సూర్ చేశాడు? వివరాలు చెప్పండి'' అన్నాడు కనకరాజు.

సదాశివం తలూపి టేబుల్ మీదున్న బెల్ నొక్కాడు. రూమ్ బయట వున్న ప్యూన్ లోపలకు వచ్చాడు.

''సార్‌ని, వీర్రాజు గారి వద్దకు తీసుకెళ్ళు'' అన్నాడు సదాశివం.

కనకరాజు పక్క గదిలో వున్న వీర్రాజుని కలిశాడు. విషయం చెప్పాడు. వీర్రాజు రేక్‌లో వున్న ఓ ఫైల్ తీసి గబగబ పేజీలు తిరగేసి ఒక పేజీ దగ్గర కాగితం ముక్క వుంచి ఫైల్‌ను కనకరాజుకి అందించాడు. ఆ ఫైల్లో – శ్రీనాథ్ తన షాపును రెండు లక్షలకు జనరల్ అండ్ ఫైర్ యాక్సిడెంట్స్ ఇన్సూర్ చేశాడు. అందుకు ఓ బాండ్ కూడా రాశాడు. మొదట ప్రీమియం ఆరు వందలు కట్టినట్టుగా రసీదు కాపీ వుంది. ఆ బాండ్ మీద సాక్షి సంతకం శంకర్ అని వుంది. బాండ్‌పై తేదీ 10.6.80 అని వుంది.

''థాంక్స్'' ఫైలు మూసి వీర్రాజుకి అందిస్తూ అన్నాడు కనకరాజు. వెంటనే సదాశివం గదిలోకి వచ్చాడు.

''మీరు వెంటనే... మీ బ్రాంచ్‌లన్నింటికీ అర్జెంట్ మెసేజ్ పంపాలి. ఆ మెసేజ్ నుంచి వచ్చే సమాచారం నాకు అందించాలి'' అని మెసేజ్ మేటర్‌ని ఒక కాగితంపై రాసి ఇచ్చాడు కనకరాజు.

''అలాగే పంపిస్తాను'' అన్నాడు సదాశివం.

***

కనకరాజుకి ఎదురుగా పి.సి. ఫోర్ వన్ టూ, అతని పక్క ఇరవై యేళ్ళ యువకుడు నిల్చుని వున్నారు. ఆ యువకుని వేపు చూశాడు కనకరాజు. అతడి తల చెదిరి వుంది. కళ్ళు ఎర్రగా వున్నాయ్. చేతులు వెనక్కి దాచుకుని వున్నాయ్.

''సార్! శ్రీనాథ్ షాపులో పనివాళ్ళు ఎవరూ లేరట. ఎంక్వయిరీ చేశాను. ఈ శంకర్ పేరే అంతా చెప్పారు. శంకర్ అడ్రస్ కనుక్కుని ఇంటికెళ్ళాను. అప్పుడే అతను ఇంట్లోంచి బయటకు వస్తూంటే మీ వద్దకు తీసుకొచ్చాను'' అన్నాడు ఫోర్ వన్ టూ.

''నువ్వు వెళ్ళి వేలిముద్రల నిపుణుడు నీలకంఠాన్ని రమ్మని చెప్పు'' అన్నాడు కనకరాజు.

''ఎస్సార్!'' అని వెళ్ళిపోయాడు పి.సి. ఫోర్ వన్ టూ.

''శంకర్! నీ విషయం యావత్తూ – నాకు ఇన్సూరెన్స్ మేనేజర్ సదాశివం చెప్పారు. నువ్వే శ్రీనాథ్‌ని హత్యచేసి ఆ నేరం కప్పిపుచ్చడానికి అతనిపై పెట్రోలు పోసి అంటించావు. షాపుతోపాటు అతనూ అగ్నికి ఆహుతి అయ్యాడు. అంతా అగ్నిప్రమాదం అనుకున్నారు. శ్రీనాథ్ తన షాపును రెండు లక్షలకు ఇన్సూర్ చేశాడు. సాక్షి సంతకం నువ్వు చేశావు. ఒకవేళ షాపు అగ్నిప్రమాదానికి లోనైతే ఆ సొమ్ము శ్రీనాథ్‌కి గానీ, నీకు గాని ఇమ్మని శ్రీనాథ్ బాండ్‌లో రాశాడు. శ్రీనాథ్ ఇన్సూరెన్స్ చేసి నేటికి ఆరు నెలలు అయింది. రెండు లక్షలకోసం శ్రీనాథ్‌ని హత్య చేశావు'' అన్నాడు కనకరాజు.

''సార్! నేను శ్రీనాథ్‌ని హత్య చేయలేదు. అతడే ప్రమాదానికి గురయ్యాడు'' అన్నాడు శంకర్.

శంకర్ వేపు చూశాడు కనకరాజు. శంకర్ చేతుల్ని ముందుకు లాగాడు. అతడి అరచేతులకు కట్లు కట్టి వున్నాయి.

''ఏమిటి నాటకం?'' అరిచాడు కనకరాజు.

''చేతులు కాలాయి సార్! మందు వేసి కట్లు కట్టారు ఆస్పత్రిలో'' అన్నాడు శంకర్.

అక్కడకు వచ్చాడు వేలిముద్రల నిపుణుడు నీలకంఠం. అతనికి సంజ్ఞ చేశాడు కనకరాజు.

నీలకంఠం శంకర్ అరచేతికున్న కట్లు విప్పాడు. శంకర్ అరచేతులు, వేళ్ళు కాలి వున్నాయ్! శంకర్ వేలిముద్రలు తీసుకొని వెళ్ళిపోయాడు నీలకంఠం.

అప్పుడే అక్కడకు వచ్చాడు 'ది భారత్ జనరల్ అండ్ ఫైర్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ సదాశివం. శంకర్ వేపు చూశాడు. అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

''కనకరాజు గారూ... ఆరోజు మా ఆఫీస్‌కి శ్రీనాథ్‌తోపాటు ఇతడే వచ్చాడు. బాండ్‌లో ఇతనే రెండవ నామినీ సంతకం చేశాడు'' చెప్పాడు సదాశివం.

''శంకర్! నిజం చెప్పు. మమ్మల్ని శ్రమపెట్టకు. నీకే నష్టం'' కఠినంగా అన్నాడు కనకరాజు.

శంకర్ పెదవి విప్పాడు.

''నేనూ శ్రీనాథ్ బావా బావమరుదులం. ప్రతీ ఊళ్లోనూ ఇద్దరం కలిసి అనేకరకాల వ్యాపారాలూ చేశాం. ఆ వ్యాపారాలకు ఇన్సూరెన్స్ చేసి వ్యాపారాలను అగ్ని ప్రమాదాలుగా సృష్టించి ఫర్నిచర్, సామానులు కాలిపోయి నష్టం వచ్చినట్టుగా ఇన్సూరెన్స్ వాళ్ళను మోసంచేసి చాలా పెద్దమొత్తంలో బాగా సొమ్ములు సంపాదించాం. ఈ నగరం వచ్చాం. శ్రీనాథ్ ఫ్యాన్సీ అండ్ స్టేషనరీ షాపు ప్రారంభించాడు. ఇన్సూరెన్స్ చేయించి ఒక ప్రీమియం కట్టాడు. నేను శ్రీనాథ్‌కి సహాయంగా వుండేవాణ్ణి. నిన్న రాత్రి తొమ్మిదింటికి బయటి నుంచీ పెట్రోలు టిన్నుతో శ్రీనాథ్ వచ్చాడు.. విషయం చెప్పాడు. 'శ్రీనాథ్.. మనం చాలాచోట్ల చాలాసార్లు ఇన్సూరెన్స్ వాళ్లని మోసంచేసి సొమ్ము దోచుకున్నాం. మోసం కలకాలం సాగదు. ఇక మోసాలకు మంగళం పాడుదాం' అన్నాను. అతడు నా మాట పెడచెవిని పెట్టాడు. నాకు అరవై వేలు ఇస్తానన్నాడు. వాడి మాటలకు లొంగిపోయాను. ఆ తర్వాత మేము అర్ధరాత్రి వరకూ తిరిగి షాపుకు వచ్చాం. నన్ను బయట వుంచి శ్రీనాథ్ షాపు లోపలకు వెళ్లాడు. పావుగంట అయ్యాక లోపల నుంచి మంటలు వచ్చాయి.

'శంకర్... రారా.. రక్షించు' అని లోపలినుంచి శ్రీనాథ్ అరవసాగాడు. మంటల వేడి షట్టర్‌కి తగిలాయి. వేగంగా నేను షట్టర్‌పై చేతులు వేసి షట్టర్ ఎత్తబోయాను. నా చేతులు... అదే నా అరచేతులు కాలాయి. లోపలకి వెళ్లలేకపోయాను. ఆ పెనుమంటలో శ్రీనాథ్ బలి అయిపోయాడు'' చెప్పడం ఆపాడు శంకర్.

''ఆ తర్వాత నువ్వే మాకు సమాచారం అందించావా?''

''ఔను సార్'' అన్నాడు శంకర్.

అంతలో అక్కడికి వేలిముద్రల నిపుణుడు నీలకంఠం వచ్చి షట్టర్‌పై వున్న రెండో జత వేలిముద్రలు శంకర్‌వే అని చెప్పాడు.

''సదాశివం గారూ.. శ్రీనాథ్‌కి శంకర్ తోడ్పడ్డాడు. అందుకు స్వల్పశిక్ష తప్పదు'' అని శంకర్‌ని సెల్ లోపలికి సాగనంపాడు క్రైమ్ బ్రాంచ్ ఎస్.ఐ. కనకరాజు.

**– ఆర్. రమణీమోహన్**